క్లుప్తంగా

రీసర్వేతో భూ వివాదాల పరిష్కారం

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో చేపడుతున్న భూముల రీసర్వేతో భూ వివాదాలు పరిష్కారమవుతాయని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.బుచ్చయ్య అన్నారు. పట్టణంలోని పెదకావు వీధిలో రైతులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ద్వారా ఎక్కడా సమస్యలు లేకుండా వివాదాలు పరిష్కరించుకునే అవకాశం కలిగిందన్నారు. రైతులు ఆధార్ కార్డు, పాసుపుస్తకం, ఫొటో సంబంధిత వీఆర్వోలకు అందించాలని సూచించారు. సర్వే పూర్తి చేసిన అనంతరం రైతుల సమక్షంలోనే హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో టీడీ సన్యాసిరావు, బి.శ్రీనివాసరావు, బంకి రాజా తదితరులు పాల్గొన్నారు.

స్వర్గ రథం ప్రారంభం



స్వర్గ రథం వాహనానికి పూజలు

పాలకొండ రూరల్: పట్టణంలోని సెగిడి వీధిలో ఉన్న సత్యసాయి శివ మందిరానికి స్వర్గరథాన్ని పల్లా కొండల రావు వితరణగా అందించారు. అంతిమ యాత్రల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ వాహనాన్ని అవసరమైన వారికి అందిస్తూ సేవ చేయాలని ఆయన కోరారు. గురువారం ఈ వాహనాన్ని కోటదుర్గమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో మందిర కన్వీనర్ ప్రభాకర్, సభ్యులు గీతా సాహూ, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

వీరఘట్టం: మండలంలోని పాలమెట్ట గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందిస్తున్న దాత

బలిజిపేట: మండలంలోని పెదపెంకి నేతాజీ గ్రంథాలయానికి ప్రముఖ విద్యా వేత్త, తెర్లాం మండలం లోచర్ల గ్రామానికి చెందిన జి.అప్పలనాయుడు పుస్తకాలను వితరణగా అందించారు. గ్రంథాలయాన్ని విజ్ఞాన భాండాగారంగా తయారుచేయాలని అవసరమైన సహకారం అందిస్తామని దాత ఈ సందర్భంగా చెప్పినట్లు గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు తెలిపారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ

పార్వతీపురం టౌన్: ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో దాతల ద్వారా నిధులు సేకరించి, వాటితో పోషకాహార కిట్స్ వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశామని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎ.శ్యామ్ కుమార్ తెలిపారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డీఎంహెచ్ఓ ఆఫీసులో టీబీ వ్యాధి గ్రస్తులు, సిబ్బందితో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం, పరిసర ప్రాంతాల్లో 40 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు దాతల సహాయంతో పోషకాహార కిట్స్(గుడ్లు, కందిపప్పు, నూనె, పప్పు చక్కీలు) పంపిణీ చేసి టీబీ వ్యాధిపై అవగాహన కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా. డి. భాస్కర రావు, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ విష్ణు డీఎంహెచ్ఓ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు చెల్లించాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నిరంతరం విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వై.మన్మథరావు, జి.వెంకటరమణ కోరారు. ఈ మేరకు గురువారం గ్రీన్‌అంబాసిడర్లు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వేతనాలు చెల్లించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సేకరణ చేస్తూ పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం నిరంతరం గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. గ్రీన్‌అంబాసిడర్లకు గ్రామ పంచాయతీల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



సంక్షేమ పథకాల కరపత్రాన్ని ఓ మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

● ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. తూడి గ్రామంలో గురువారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి గత నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అందిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతీ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరింది. ఏయే పథకాల ద్వారా ఎంత మొత్తం వారి బ్యాంకు ఖాతాలో జమైందో ప్రజలకు వివరించారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం వారి సమస్యలు వింటూ వాటి పరిష్కారానికి వెంటనే అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఒక్కసారి ఆలోచించండి

రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల అభివృద్ధికి పాటుపడుతుంటే చూడలేని ప్రతిపక్షం విషం చిమ్ముతోందన్నారు. ఇళ్లు లేని పేదలకు పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలని జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని, ఓర్వలేని టీడీపీ నేత చంద్రబాబు పేదలకు ఇచ్చే సెంటు భూమి శ్మశాన వాటికతో పోల్చారని, పేదలంటే ఇంత చులకన భావన తగదన్నారు. పేదల పక్షాన నిలబడాల్సిన ప్రతిపక్షం పేదల కడుపులు కొట్టాలని చూడడం చాలా దారుణమన్నారు. ఇటువంటి టీడీపీని రాష్ట్రం నుండి తరిమికొట్టేందుకు ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, సర్పంచ్ కుద్దిగాన వెంకటరమణమూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం లక్ష్యం



వల్లరగుడబలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని పెదగుడబలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల గత నాలుగేళ్లలో కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఏవైనా సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న బాటలోనే అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమవంత్రి జగనన్న అమలు చేస్తున్నారన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు నిలుపుదల చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. జగనన్న మరో 30 సంవత్సరాలు పాటు ముఖ్యమంత్రిగా వుంటే ప్రతీ ఇల్లు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం రాజ్యమేలుతుంటే ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన నాయకులకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ, మండల కన్వీనర్ ఉరిటి రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, వైస్ ఎంపీపీ బత్తల లక్ష్మి, నాయకులు అల్లు లక్ష్మీనారాయణ, బి.పకీరునాయుడుతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

భామిని: మండలంలోని బాలేరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జి.కృష్ణారావు గురువారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను తనిఖీ చేశారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున ఉదయం వేగరంగా పనులు ప్రారంభించి ఎండ తీవ్రత పెరగక ముందే ఆపి వేయాలన్నారు. వడదెబ్బకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పలుచోట్ల 'ఫ్యామిలీ డాక్టర్'



వీరఘట్టం: వైద్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్

వీరఘట్టం: మండలంలోని యు.వెంకమ్మపేటలో వీరఘట్టం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. డాక్టర్ జి.ప్రదీప్‌కుమార్ గ్రామంలోని 150 మందికి వైద్య తనిఖీలు చేశారు. వీరిలో 5 మంది జ్వరపీడితులకు మందులు అందజేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున బయటకు వెళ్లేటప్పుడు నీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు.

నల్లరాయిగూడలో..



భామిని: నల్లరాయిగూడలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి దీపికారాణి

భామిని: మండలంలోని నల్లరాయిగూడలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బాలేరు వైద్యాధికారిణి బి.దీపికారాణి ఆధ్వర్యంలో వైద్య బృందం ఆదివాసీల ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. 104 సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది తమ సేవలు అందించారు.

నిబంధనలపై అవగాహన కలిగించాలి

పార్వతీపురంటౌన్: సమగ్రమైన, సురక్షిత గర్భనిరోధక, గర్భస్రావం పద్ధతులు, నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం జిల్లా ఆస్పత్రిలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సవరణలను అనుసరించి సురక్షితమైన గర్భస్రావం, గర్భనిరోధక పద్ధతులను పాటించాలని, నిబంధనల మేరకే నిర్వహించాలని, అర్హులైన, ఆమోదం పొందిన వైద్యుల ద్వారా మాత్రమే జరగాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో మారుమూల గ్రామాలు ఎక్కువగా ఉండడం వల్ల ఈ నిబంధనపై ప్రజల్లో మరింతగా అవగాహన కలిగించాలని సూచించారు. అర్హులైన వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల షాపుల్లో గర్భ నిరోధక మాత్రలు ఇవ్వరాదని అటువంటి వారిని గుర్తిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవాంఛిత గర్భం దాల్చిన వారిని గుర్తించినా లేదా వారే స్వయంగా వైద్య సిబ్బందిని సంప్రదించినా వారికి సురక్షిత పద్ధతులపై అవగాహన కల్పించాలని, ఆస్పత్రిలో ప్రసవం శ్రేయస్కరమని వివరించాలని స్పష్టం చేశారు. వారి వివరాలు గోప్యంగా ఉంచాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ బి.శంకరరావు గురువారం తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని లైన్‌ల మెయింటెనెన్స్ చేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఈదురుగాలికి పడిపోయిన వరిచేను



లక్ష్మీపురంలో పడిపోయిన వరి చేను

సీతానగరం: మండలంలో రబీవరిచేను పంట కోత దశకు వచ్చే సమయంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలికి పొలాల్లోని వరిచేను పడిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస, బుడ్డిపేట, వెంకటాపురం, పెదంకలాం, బూర్జ గ్రామాల్లో రైతులు రబీవరి సాగు చేశారు. పంటపక్వదశకు వస్తున్న సమయంలో వడగళ్ల వాన, ఈదురుగాలి వీయడంతో పంట నేల మట్టం కావడంతో నష్టం వాటిల్లుతుందని రైతులు శంకరరావు, గణేష్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పి.చాకరాపల్లిలో క్రాష్ ప్రోగ్రాం



గ్రామంలో బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని పి.చాకరాపల్లిలో గురువారం బోర్లకు మరమ్మతులు చేపట్టారు. బోర్లు మరమ్మతుల బారిన పడడంతో ప్రజలు నీటికి ఇబ్బందులు ఎదుర్కోగా సర్పంచ్ మోహనరావు ఇచ్చిన సమాచారం మేర క్రాస్ ప్రోగ్రాం ఏర్పాటుచేసి బోర్లకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఆరా..

సాలూరు: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పీఆర్ ప్రాజెక్ట్ డీఈ శర్మ మంత్రిని సాలూరులోని ఆయన స్వగృహంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా శాఖాపరంగా జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిపై ఆరా తీశారు. పాచిపెంట మండలంలోని వేటగానివలస – తంగ్లాం రోడ్డుకు సంబంధించి అటవీశాఖ అనుమతులు వచ్చినప్పటికీ పరిపాలనా అనుమతులు కోసం వేచి చూస్తున్నామని డీఈ తెలపగా.. అనుమతులు ఆలస్యం కావడానికి గల కారణాలేమిటని రాజన్నదొర అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత శాఖ రాష్ట్ర అధికారులతో మాట్లాడి అనుమతులు త్వరితగా మంజూరు చేయాలని ఉపముఖ్యమంత్రిని ఆదేశించారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ గావించి పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన గురువారం రోజున పలు ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులతో ఆలయ అర్చకుడు స్వామివారికి పూజలు చేయించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకుడు శ్రీనివాసరావు పర్యవేక్షణలో తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

కొత్త కూలీ రేట్లు అమలుకు డిమాండ్



ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ వద్ద హమాలీల నిరసన

గుమ్మలక్ష్మీపురం: కొత్త కూలీ రేట్లు (ఎరియర్స్) అమలు చేయాలని గుమ్మలక్ష్మీపురం ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ హమాలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ వద్ద హమాలీలు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల హమాలీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మక ప్రసాద్, టి.గోపాల్ మాట్లాడుతూ సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పని చేస్తున్న హమాలీలకు 1 జనవరి 2022 నుంచి కొత్త కూలీ రేట్లు అమలు పర్చేందుకు సివిల్ సప్లై కార్పొరేషన్ అంగీకరించినప్పటికీ, నేటికీ పెంచిన కూలీ రేట్లు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా కొత్త కూలీ రేట్లు చెల్లించి హమాలీలను ఆదుకోవాలని వారంతా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సహదేవుడు, జి.రాము, ప్రకాష్, పోలన్నదొర తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ చిరంజీవి, సిబ్బంది

పాలకొండ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.చిరంజీవి అన్నారు. అట్టలి గ్రామంలో సర్పంచ్ కె.సంధ్యారాణి పర్యవేక్షణలో వైఎస్సార్ కంటి వెలుగు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు ఇచ్చారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కళ్లద్దాలతో పాటు మందులు అందజేశారు. కార్యక్రమంలో క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం



ఏపీ సచివాలయ ఉద్యోగుల మండల నూతన కార్యవర్గం

పాలకొండ: సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం ఏకగ్రీవమైంది. ఏపీజీఈఏ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఎన్నికలో మండల తాలుకా యూనిట్ అధ్యక్షుడిగా ఎస్.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బి.నరేష్, ఉపాధ్యక్షునిగా ఆర్.మన్మథరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి.వినోద్, సంయుక్త కార్యదర్శిగా వి.మురళీధర్, కోశాధికారిగా సురేష్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి జిల్లా ఏపీజీఈఏ నాయకులు అభినందనలు తెలిపారు.

బాధితులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు



బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు

సీతంపేట: ఈదురుగాలులు, వర్షానికి బుధవారం చిన్నబగ్గ కాలనీలో రెండు రేకుల ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన నిమ్మక సరోజిని, బిడ్డిక భాస్కరరావుల కుటుంబాలను మండల వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. బాధితులకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి దృష్టికి జరిగిన నష్టం వివరించి ఆదుకుంటామని పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. అనంతరం చిన్నబగ్గలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పసుపురెడ్డి అభిషేక్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎన్.ఆదినారాయణ, ఎర్రయ్య, సర్పంచ్‌లు కళావతి, ఆదిలక్ష్మి, ప్రధాని, ఎంపీటీసీ మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మస్టర్లు సక్రమంగా వేయాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ఫీల్డ్ సహాయకులు ఉపాధి వేతనదారులకు మస్టర్లు సక్రమంగా వేయాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని సింగన్నవలస గ్రామంలో మైనర్ సాగునీటి వనరుల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ సగటు వేతనం రూ.275 వచ్చేలా పనులు చేయాలన్నారు. అనంతరం అక్కడి సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుంటంతో సిబ్బంది రైతులకు అవసరమైన సేవలు విస్తృతం చేయాలన్నారు. ప్రభుత్వం వారికి కేటాయించిన పథకాలపై అవగాహన కల్పించాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

పాలకొండ: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీజీఈఏ సంఘం నాయకులు నూతలపాటి భరత్‌భూషణ్‌రావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఒక్క రోజు నిరాహార దీక్షను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీక్షలో ఎం.సింహచలం, బి.జగదీశ్వరరావు, జె.రవీంద్రకుమార్, వి.రమేష్, బలివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కురుపాం: ప్రతి ఒక్క రైతు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేశ్వర రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 31 వరకు వరి విత్తనాల కోసం రైతుల ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, రైతులకు కావాల్సిన విత్తనాల రకాన్ని బట్టి నగదు తీసుకొని ఆర్బీకే కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.